క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో చేరండి



విద్యార్థినికి పాఠశాలలో చేరడానికి అనుమతి పత్రం ఇస్తున్న హెచ్ఎం సాయిరామకృష్ణ

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రవేశాలపై మంగళవారం పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియం, ఉచిత విద్య, నాణ్యమైన భోజనం, మూడు జతల యూనిఫాం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

గ్రామీణులకు మరిన్ని తపాలా సేవలు

ఎస్పీఎం సత్యనారాయణమూర్తి



చదలాడ బీపీఎం రవిని సత్కరిస్తున్న పోస్టల్ సిబ్బంది

పెద్దాపురం: గ్రామీణులకు తంతి తపాలా శాఖ మరిన్ని సేవలందించనున్నట్లు మల్లాం సబ్ పోస్ట్ మాస్టర్ (ఎస్పీఎం) సత్యనారాయణమూర్తి, తంతి తపాల శాఖ మెయిల్ వాచర్ త్రిమూర్తులు అన్నారు. మండలంలోని చదలాడ బ్రాంచి పోస్ట్ మాస్టర్ (బీపీఎం) ప్రగడ రవి పదోన్నతిపై బదిలీ కానున్న నేపథ్యంలో మంగళవారం సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీఎం మూర్తి మాట్లాడుతూ తంతి తపాల శాఖలో ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం మరింత గుర్తింపునిస్తుందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు పదోన్నతులు కల్పిస్తుందన్నారు. చిన్న వయసులో ఎన్నో సేవలందించిన రవి పదోన్నతిపై వెళ్లడం అభినందనీయని, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మల్లాం సబ్ పోస్టల్ ఆఫీస్ (ఎస్ఓ) పరిధిలోని బీపీఎంలు, ఈడీఎంసీలు, ప్యాకర్లు, పోస్టల్ సిబ్బంది రవిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చవ్వాకుల ఈశ్వరరావు, బాబ్జీ, పొన్నాడ సత్య గంగాధరం, రాజేష్, సుబ్బారావు, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి




పాలిటెక్నిక్ మెటీరియల్ అందజేస్తున్న వెంకటరాజు

పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ), భారత విద్యార్థి ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వక్తలు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఉచిత పాల్‌టెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో మంగళవారం పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన అమెరికాలో ఉంటున్న పెద్దాపురం వాసి కొనగోళ్ల నాగ రఘు సహకారంతో ఆయన కటుంబ సభ్యులు కొనగోళ్ల వెంకటరాజు మెటీరియల్ అందజేశారు. మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి దేవత రాజేష్, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్, పెదిరెడ్డి, ఆరీఫ్ ఆలీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం కావడం ఇప్పటి నుంచి అలవర్చుకోవాలన్నారు. విద్య పట్ల పీసీసీ, భారత విద్యార్థి ఫెడరేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోరడ్ల రమాప్రభ, నీలపాల బాల మురళీకృష్ణ, మండవల్లి భాస్కరరావు, ప్రశాంత్ కోరుకొండ, వడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినం కావడంతో ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకు మార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు పాల్గొన్నారు.



పూజలు అందుకున్న కుమారా రామభీమేశ్వరస్వామి

రాముని భూమిలో రాబందులు

- దేవుని భూమి ఆక్రమణకు యత్నం
- భూ ఆక్రమణ యత్నంపై భక్తుల ఆందోళన
- ఆక్రమణదారులకు అధికారులు అండ!
- కలెక్టర్ దృష్టికి ఆక్రమణ పంచాయితీ

కొత్తపల్లి: దాతలు నిర్మించిన ఆలయాలకు ధూప, దీప నైవేద్యాల నిమిత్తం దాతలే భూములను దానం చేసారు. అ భూములలో కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. రాముని భూమిలో రావణాసురుల్లా వ్యవహరిస్తున్నారు. మండలంలోని గోర్సలో ఉన్న పురాతన సీతారామ ఆలయానికి సంబంధించిన భూమి ఆక్రమణపై మంగళవారం గ్రామస్తులు హిందూ ధర్మరక్షా సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీగా గ్రామ సచివాలయానికి చేరుకుని ఆలయ భూములను రక్షించాలి, దేవుని భూమిని కాపాడాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. సచివాలయ, రెవన్యూ ఉద్యోగులను నిర్బంధించి తహసీల్దారు, జిల్లా దేవదాయ శాఖ అధికారులు రావాలంటూ డిమాండు చేశారు. దేవుని భూమి కోసం పోరాడుతున్న గ్రామస్తులపై అధికారులు పోలీసుల సహకారంతో ఆందోళనను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆందోళన మరింత ఉధృతం చేశారు. డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ, జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావుకు సమాచారం ఇవ్వడంతో వారు ఆందోళన ప్రదేశానికి చేరుకున్నారు. దేవుని భూ సమస్య తక్షణమే పరిష్కరించాలంటూ ఆయనను వారు డిమాండ్ చేశారు. సుబ్బారావు మాట్లాడుతూ ఆలయ భూములకు సంబంధించి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని తమతో పాటు గ్రామస్తులు కూడా రావాలంటూ చెప్పడంతో ఆందళన విరమించి కలెక్టర్‌ను కలుసుకునేందుకు కాకినాడ వెళ్లారు. ఇందులో భాగంగా ఎండ తీవ్రతకు పితాని నాగేశ్వరావు సొమ్మసిల్లి పడిపోయారు. ఈ కార్యక్రమం హిందూ ధర్మ రక్షా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవర్రాజు, గ్రామ సర్పంచి రొంగల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



గోర్స సచివాలయం వద్ద ఆందళన చేస్తున్న గ్రామస్తులు

భూమిని సాధించే వరకూ పోరాటం ఆగదు



ఆక్రమణలో ఉన్న దేవుని భూమిని సాధించుకునే వరకూ పోరాటం ఆగదు. ఆక్రమణదారులకు దేవదాయ అధికారులు కొమ్ముకాస్తున్నారు. గ్రామస్తులంతా భూమికోసం పోరాడుతుంటే అధికారులకు చీమకుట్టినట్‌లైనా లేదు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించాలి.

– కె.లక్ష్మి, భక్తురాలు, గోర్స

ప్రాణత్యాగానికైనా సిద్ధం



రాముడి భూమిని కాపాడుకునేందుకు ప్రాణ త్యాగానికైనా సిద్ధం. సుమారు 40 ఏళ్ల నుంచి గ్రామస్తులంతా కలిసి పోరాటం చేస్తున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇకపై అధికారుల ఆటలు సాగవు.

జి.రాణి, భక్తురాలు, గోర్స

కలెక్టర్ దృష్టికి తీసుకువెళుతున్నాం

గోర్స సీతామార స్వామి ఆలయ భూముల విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం. త్వరలోనే సమస్య పరిష్కరించుకునేందుకు కృషి చేస్తాను.

– ఈవీ సుబ్బారావు, జిల్లా దేవదాయ శాఖ అధికారి

మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: పిఠాపురం శాసనసభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు అగ్ని ప్రమాదంలో గాయాలైనట్లు వచ్చిన వార్త తనను షాక్‌కు గురి చేసిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాయాలైన చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని కోరుకుంటున్నానని, ఆ భగవంతుడి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.

ఏపీఎస్పీ ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: వేసవి ఎండల్లో ప్రయాణాలు సాగించే వారికి దాహార్తి తీర్చేందుకు రమణయ్యపేటలో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద పిఠాపురం రోడ్డును ఆనుకుని ఏపీఎస్పీ సిబ్బంది, అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి ముగిసే వరకు చల్లని తాగునీటితో పాటు మజ్జిగను పంపిణీ చేస్తామని ప్రారంభోత్సవం అనంతరం కమాండెంట్ నాగేంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శృంగార వల్లభుని కల్యాణం



తొలి తిరుపతి శృంగార వల్లభుని కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

- గోవిందనామ స్మరణతో మార్మోగిన తిరుపతి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

పెద్దాపురం: మండలం తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని దివ్య కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలతో వేలాది భక్తుల జన సందోహం మధ్య ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శృంగార వల్లభుడి ఉభయ దేవరులైన లక్ష్మీదేవి, భూదేవి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ప్రారంభించి వీక్షించారు. వందల సంఖ్యలో దంపతులు పీటలపై ఆశీనులు కాగా ఉత్సవ దేవతామూర్తులను ఆలయ అర్చకుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, వేదపండితుల మంత్రాల మధ్య ఆలయం నుంచి మండపానికి తీసుకుచ్చి స్వామి వారి కళ్యాణాన్ని జరిపించారు. దేవదాయ శాఖాధికారులు స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారి కల్యాణానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భారీ విద్యుద్దీపాలంకరణ, మందుగుండు సామగ్రి, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పీటలపై ఆశీనులైన దంపతులు

నేత్రపర్వం మాండవ్యనారాయణుని పరిణయం

- అలరించిన దీపాలంకరణ
- 13న శ్రీపుష్ప యాగోత్సవం

సామర్లకోట: స్థానిక భీమవరం తుల్య భాగ నదీ తీరాన కొలువైన శ్రీదేవి సమేత మాండవ్యనారాయణస్వామి కల్యాణం ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున స్వామి వారికి అమ్మవార్లకు మంగళ స్నానాలు, పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం విశేష పూజలు, అంకురార్పణ, ధ్వాజారోహణ, భక్త బృందంచే విష్ణు సహస్ర నామ పారాయణ జరిగాయి. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులచే చేసిన దీపారాధన ఎంతగానో ఆకట్టుకుంది. వేదపండితుల మంత్రాలతో స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. పారిశ్రామిక వేత్త బిక్కిన సత్యపరమేశ్వర సాయి, వల్లూరి బుల్లియ్య కల్యాణ ఉత్సవాలు ముగిసే వరకు ప్రతి రోజు పూజలు ఉంటాయని, శుక్రవారం మధ్యాహ్నం స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. మాండవ్య నారాయణస్వామి భజన మండలిచే పురందర దాసు కీర్తనలు నిర్వహిస్తారని, 12న గ్రామోత్సవం, 13న రాత్రికి స్వామి వారి శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. వేద పండితులు ఖండవిల్లి దుర్గప్రశాంతాచార్యుల పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. ఆలయ అర్చకులు చక్రవర్తులు రఘురామ్ ఆచార్యులు, రవికుమార్ ఆచార్యులు, పద్మనాభాచార్యులు పూజాదికాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని స్వామి వారి అమ్మవార్లను తులసీ దళాలతో అలంకరించారు. ఆలయంలో వెలసిన లక్ష్మీదేవిని వెండి ఆభరణాలతో అలంకరించారు.



భక్తుల నడుమ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



ఆలయంలో కొలువై ఉన్న లక్ష్మీదేవి



పూజలు అందుకున్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణస్వామి

అప్రమత్తంగా లేకుంటే కఠిన చర్యలు

స్కూలు బస్ డ్రైవర్లకు సీఐ హెచ్చరిక

పిఠాపురం: ప్రైవేటు విద్యా సంస్థల వాహనాల డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎక్కడా ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా నిబద్ధతతో వ్యవహరించాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సోమవారం స్కూలు వ్యాన్ ప్రమాదానికి గురై విద్యార్థులు గాయపడిన నేపథ్యంలో ఆయన మంగళవారం మండల పరిధిలోని ప్రైవేటు విద్యా సంస్థల బస్, వ్యాన్‌ల డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మామూలు వాహనాల కంటే విద్యార్థులను తరలించే వాహనాల డ్రైవర్లు చాలా జాగ్రత్తగా నడపాలన్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు చూసుకుంటు ఫిట్‌నెస్ తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. అతి వేగంగా వెళ్లకుండా వాహనాలను ప్రమాద రహితంగా నడపాలని సూచించారు.



డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాస్

మద్యం సేవించి, ఇతర మత్తు పదార్థాలు సేవించి వాహనాలను నడిపినట్లు తెలిస్తే తీసుకునే చర్యలు అత్యంత కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. విద్యార్థులను సురక్షితంగా చేర్చే బాధ్యత డ్రైవర్లపై ఉంటుందని, అందుకే అందరు డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ తదితరులున్నారు.

తమ్మవరంలో మెగా వైద్య శిబిరం

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామంలో లయన్స్ క్లబ్ సంకల్ప్ సభ్యుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ ప్రారంభించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది సహకారంతో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు, ఈసీజీ, వంటి వైద్య సేవలందించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌కు చెందిన మెట్టా రాధ, పున్నరాజు రాజేశ్వరి, సామా రాజేశ్వరి, శ్రీదేవి, సువర్చల, రత్నమాల, రేవంత్, లక్ష్మీనాగేంద్ర, సాయికృష్ణ, తమ్మవరం గ్రామానికి చెందిన గొల్లపల్లి అప్పలరాజు, మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైకులు నడిపిన కేసుల్లో 12 మందికి రెండు చొప్పున రోజుల జైలు, 13 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా దొరబాబు

కాకినాడ లీగల్: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది ఎస్.దొరబాబును నియమిస్తూ ప్రభుత్వ సెక్రటరీ జి.ప్రతిభాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విధులను మూడేళ్ల కాలపరిమితిని నిర్ణయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దొరబాబుకు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

టీబీ విముక్తి పంచాయతీలు 39

కాకినాడ క్రైం: జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా 2024 సంవత్సరానికి జిల్లాకు చెందిన 39 పంచాయతీలు టీబీ విముక్తి పంచాయతీలుగా గుర్తించబడినట్టు డీఎంహెచ్‌వో నరసింహానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీబీ నివారణ, టీబీ సోకిన రోగులకు సకాలంలో అందించే వైద్యసేవలు, నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలు ప్రామాణికంగా ఎంపిక జరిగిందన్నారు. ఆ దిశగా కృషి చేసిన పంచాయతీ సెక్రటరీలకు టీబీ, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లతో పాటు బహుమతులు ప్రదానం చేశామన్నారు.

పది రోజులైనా బాధితులను పట్టించుకోరా



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్, కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

బోట్‌క్లబ్: అగ్ని ప్రమాదం జరిగి పదిరోజులైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక దుమ్ములపేటలో అగ్నిప్రమాదం జరిగి పది రోజులైనప్పటికీ ఇప్పటికీ కూటమి ప్రభుత్వం వారికి ఏ విధమైన సహాయం చేయలేదన్నారు. స్థానిక నాయకుల ద్వారా అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వారికి అండగా నిలవాలని చెప్పడంతో మంగళవారం బాధితులకు ధైర్యం చెప్పినట్లు చెప్పారు. వారికి ఆర్థిక సహాయం కూడా అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదం సంభవిస్తే అదే రోజు వారికి ఆర్థిక సహాయం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. నేటికి పది రోజులైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ప్రస్తుతం వారి కుటుంబం రోడ్డున పడిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు స్పందించి అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికలకు రెండో రోజు 14 నామినేషన్లు



నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: ఈ నెల 21వ తేదీన జరిగే కాకినాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు మంగళవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు అధ్యక్ష పదవికి పి.ప్రసన్న కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి పి.రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీ పదవికి వెలిగొట్ల శ్రీనివాస్, బండి నరేంద్ర, కోశాధికారి పదవికి జి.వెంకట దుర్గ ప్రసాద్, లైబ్రరీ సెక్రటరీ పదవికి గండికోట కల్యాణి, షేక్ అమీర్ జానీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి జోకా.వి.ఎస్.విజయకుమార్, మహిళా ప్రతినిధి పదవికి జి.దివ్య శ్రీ విద్య, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా కె.శ్రీవాణి, సీనియర్ కమిటీ మెంబర్‌గా యెర్మల్ వసంత కుమారి, మహిళా కమిటీ మెంబర్‌గా పెంకే శ్రీదేవి, కమిటీ మెంబర్లుగా షేక్ ప్రేమ్ నజీర్, గుత్తుల మంగరాజు నామినేషన్లు దాఖలు చేశారని, బుధవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగియనుందని ఎన్నికల అధికారి ఎం.విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి చెక్కా శ్రీనివాస్ తెలిపారు.

హెచ్‌సీ భార్యకు చెక్కు అందజేత

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన జి.అప్పారావు కుటుంబానికి మంజూరైన రూ.1,67,850 చెక్కును మృతుడి భార్య రాధకు కమాండెంట్ నాగేంద్రరావు అందజేశారు. బెటాలియన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌సీ అప్పారావు మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని కమాండెంట్ తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్‌లు మన్మధరావు, మోహనరావు, ఆర్ఐ రవిశంకర్ పాల్గొన్నారు.



అప్పారావు భార్య రాధకు చెక్కును అందజేస్తున్న ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు

పిల్లల భద్రత, రక్షణ అందరి బాధ్యత

కాకినాడ సిటీ: కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో పి.సూర్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల భద్రత, రక్షణ మనందరి బాధ్యత అని ప్రతి పాఠశాల, కళాశాల, హాస్టళ్లు, ఇంట్లో పిల్లలు క్షేమంగా ఉండాలన్నారు. కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్, సేఫ్టీ రూల్స్, పోక్సో చట్టం, వ్యక్తిగత భద్రత, ఎడ్యుకేషన్ మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పించనున్నట్టు ఆయన వివరించారు.

ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో మంగళవారం సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఆయన తెలిపారు.

ఏలేశ్వరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఐదుగురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారిపై బైండోవర్ నమోదు చేశామన్నారు. వీరిని మంగళవారం ఏలేశ్వరం తహసీల్దార్ వద్ద హాజరుపరచినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు.